క్లుప్తంగా

కాంట్రాక్టు ఉద్యోగుల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

పెనుగంచిప్రోలు: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక రాష్ట్ర ప్రధానాలయాల పేస్కేల్ ఉద్యోగుల సంక్షేమ సంఘ సహాయ కార్యదర్శి, స్థానిక శ్రీతిరుపతమ్మ ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు కూడా ఆ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఢిల్లీకి వెళ్లనున్న పెనుగంచిప్రోలు ప్రజాప్రతినిధులు

పెనుగంచిప్రోలు: ఆస్పిరేషనల్ బ్లాక్ కింద పెనుగంచిప్రోలు మండలం ఎంపికైనందున ఈనెల 30న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరిగే ఆలోచనా శిబిరానికి ఎంపీపీ మార్కపూడి గాంధీతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు శుక్రవారం ఢిల్లీ వెళ్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలాన్ని మొదటి స్థానంలో నిలబెట్టేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

నేడు ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ మండపంలో జరిగే ఈ లెక్కింపులో ఆలయ సిబ్బందితో పాటు ఔత్సాహికులు పాల్గొనవచ్చన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేత

జుజ్జూరు(వీరులపాడు): వైఎస్సార్ బీమా బాధిత కుటుంబాలకు కొండంత అండ అని షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన వేముల నాగరాజు మృతి చెందటంతో వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేలను గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రమేష్, రాము, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నవయుగ కవితా చక్రవర్తికి స్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ కవిగా, నాటక రచయితగా జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నాటి యువకలను ఎందరినో ప్రభావితం చేసినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో భాగంగా ఆదిరాల జయప్రభు, రమాశంకర్, కొమ్మినేని రత్నకుమారి, పావని, శ్రావణి,శ్రీనివాసరావు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు జాషువా చిత్రపటానికి నివాళి సమర్పించారు.

బీసీలందరూ సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న



భవానీపురం(విజయవాడపశ్చిమ): జనగణనలో బీసీ కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై బీసీలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ (ఎంబీసీ) కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26న జరిగిన ఏపీ శాసనసభ సమావేశాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బీసీ కులగణన చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించటం శుభపరిణామమని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా పూర్తి స్థాయిలో బీసీ కుల గణన జరగాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు త్వరలోనే ఒక రూపం రాబోతుందన్నారు. ఎంబీసీ కార్పొరేషన్, సంచార జాతుల సంఘం తరుపున సీఎం జగన్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

భర్త అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన మొక్క ఆయేషా, శివ భార్యాభర్తలు. 2015లో వీరి ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా శివ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తెలిసిన వారి వద్ద అప్పులు చేయడంతో వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. గురువారం ఉదయం శివ భార్య, పిల్లలను బీసెంట్ రోడ్డులో దింపి ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఆయేషాకు భర్త కనిపించకపోవడంతో తెలిసిన వారిని ఆరా తీసింది. ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందిన కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆధునిక కవులలో జాషువాది విశిష్ట స్థానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ఘనంగా గుర్రం జాషువా జయంతి

నందిగామటౌన్: ఆధునిక తెలుగు కవులలో గుర్రం జాషువాది విశిష్ట స్థానం అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. గుర్రం జాషువా కళావేదిక, స్నేహక్లబ్, దళిత చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా విగ్రహానికి, చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సరళ గ్రాంధికానికి ప్రాచీన పద్య ఛందస్సును స్వీకరించి పద్యానికి కూడా జవజీవాలు కల్పించి ప్రజల్లోకి తీసుకెళ్లగలమని నిరూపించిన మహాకవి జాషువా అన్నారు. మూఢాచారాలతో నిండిన సమాజంలో అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారని ఆయన రచనల్లో గబ్బిలం ఎంతో సర్వోత్తమమైనదని కొనియాడారు. ఆలయాలలోకి దళితులకు ప్రవేశం లేదు కానీ గబ్బిలానికి అడ్డు లేదనేది ఆ రచన సారాంశమని గుర్తు చేశారు. రుక్మిణీ కల్యాణం, కోకిల, ధ్రువ విజయం తదితర రచనలు చేసి ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఘంటా విజయ్‌కుమార్, కన్నెగంటి సజ్జనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో...

పట్టణంలోని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కార్యాలయంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ కుల వివక్ష, అస్పృశ్యతపై యుద్ధం చేసిన మహోన్నత వ్యక్తి జాషువా అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వేమా సురేష్, నాయకులు బండి మల్లికార్జునరావు, దాసు, వేల్పుల రమేష్, బండారు వెంకట్రావు, మంగళపూడి కోటి తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో సినీనటుడు కట్టా ఆంథోనిని సత్కరించిన అమర్లపూడి శేఖర్ తదితరులు

గుర్రం జాషువా ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

నందిగామ: గుర్రం జాషువా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ రోడ్‌లో గల జాషువా కళా ప్రాంగణంలో జాషువా 128 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా సాహిత్యం, సామాజిక ప్రయోజనాలు అనే అంశాలపై కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జాతీయ సమైక్యత, మత సామరస్యం అనే అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో పలు ప్రాంతాలకు చెందిన కవులు, సాహితీవేత్తలు, వక్తలు పాల్గొన్నారు. జాషువా ఫౌండేషన్ అధ్యక్షుడు కోట శామ్యూల్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొబ్బిళ్ళ పాటి గోపాలకృష్ణ సాయి, కేజేడీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా స్ఫూర్తితో కవులు, కళాకారులు ఎదగాలి

కంచికచర్ల: మహాకవి గుర్రం జాషువా స్ఫూర్తితో కవులు, కళాకారులు ఎదగాలని బహుజన రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి, కవి, రచయిత తంగిరాల సోనీ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం గుర్రం జాషువా జయంతి వేడుకల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 16 మంది కవులు, 12 మంది రంగస్థల కళాకారులకు జాతీయ సాహిత్య పురస్కారాలు అందజేసి సత్కరించారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోనీ మాట్లాడుతూ సమాజంలో హెచ్చు తగ్గులు సమసిపోవాలంటే ప్రతి ఒక్కరూ జాషువా రచనలు చదవాలన్నారు. సినీ నటుడు కట్టా ఆంథోని మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర నాటిక జాషువా పద్యాల వలనే నేటికీ ప్రజాదరణ కలిగి ఉందన్నారు. అనంతరం కట్టా ఆంథోనిని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రమేష్ సన్మానించారు. కార్యక్రమంలో జల్ది విద్యాధరరావు, ప్రముఖ కవులు శిఖా ఆకాష్, కంఠ బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

నందిగామ: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన గణనాథుడి విగ్రహాలు గురువారం రాత్రి నిమజ్జనానికి తరలివెళ్లాయి. పట్టణంలోని మెయిన్ బజార్, పాత బస్టాండ్, బీసీ కాలనీ ప్రాంతాలలో పూజలు అందుకున్న గణనాథుడి విగ్రహాలను మేళ తాళాలు, డీజే డాన్సులు, కోలాట నృత్యాల నడుమ పట్టణంలో రాత్రి పొద్దుపోయే వరకు ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

ఏర్పాటు చేసిన చోటే నిమజ్జనం

పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో పలువురు యువకుల ఆధ్వర్యంలో ఐదు అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 11 రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి నందిగామ పట్టణంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం జలాభిషేకం ద్వారా అక్కడే స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిగామ పట్టణంలో మొట్టమొదటిసారి ఇటువంటి కార్యక్రమం జరగడంతో వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్ధరాత్రి వరకు ఈ కార్యక్రమం కొనసాగింది.

పేటలో హోరెత్తిన నిమజ్జనాల సందడి

జగ్గయ్యపేటఅర్బన్: గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 11 వ రోజు గురువారం గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణేష్ మహరాజ్‌కు జై అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో సాగిన నిమజ్జన ఊరేగింపులు ముక్త్యాల, వేదాద్రిలలో కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లాయి. డాంగేనగర్ మండపంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జనోత్సవంలో మేళతాళాలతో, డీజే సౌండ్ సిస్టంతో యూత్ కమిటీ సభ్యులు ఏకరూప దుస్తులు ధరించి గణపతి బొప్పా మోరియా అంటూ సందడి చేశారు.

భారీ గణనాథులను దర్శించుకున్న ఉదయభాను

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక చెరువుబజారు, డాక్టర్స్ రోడ్‌లోని మండపాల్లో ఏర్పాటుచేసిన భారీ గణనాథులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా చెరువుబజారులోని డీఏ(ధనమూర్తి,అయ్యప్ప) ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నాయకులు కుంచపు నారాయణ, తన్నీరు నాగేంద్ర, జాన్‌బాషా, వేముల విజయ్, పాటి సాంబ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పేటలోని చెరువుబజారులో ఏర్పాటుచేసిన భారీ గణ నాథుని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పాల్గొన్న డీఏ యూత్ సభ్యులు



మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేసిన చోటే జలాభిషేకంతో నిమజ్జనం చేసిన నిర్వాహకులు



పెనుగంచిప్రోలులో గణనాథుని ఊరేగింపు

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో గురువారం ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలతో పాటు మండలంలో పలు ప్రాంతాల్లో, ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు తీన్‌మార్ మోతలు, బాణసంచా మెరుపుల మధ్య జరిగాయి. ఊరేగింపుల అనంతరం విగ్రహాలను స్థానిక మునేరులో, వివిధ కాలువల్లో నిమజ్జనం చేశారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు

నందిగామ: పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల వద్ద చవితి వేడుకలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని వాసవి మార్కెట్లో ఏర్పాటుచేసిన భారీ గణపతి విగ్రహం వద్ద పలు విశేష పూజలు నిర్వహించారు. ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి వద్ద కుంకుమ పూజలు జరిగాయి. టీటీడీ కల్యాణమండపం రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ మట్టి గణపతి విగ్రహం వద్ద పలు సంధ్యలలో విశేష పూజలు నిర్వహించారు. మెయిన్ బజార్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

దైవభీతితో జీవితాన్ని పవిత్రంగా మలుచుకోవాలి

- ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు
- శాంతి ర్యాలీ చేసిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ప్రతి ఒక్కరూ దైవభీతితో జీవితాన్ని పవిత్రంగా మలుచుకోవాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నందిగామ పట్టణంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఎఎస్ఎస్‌సీ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మసీదు నుంచి పట్టణంలోని ప్రధాన రహదారులలో నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులుంటే సన్మార్గం వైపు నడిచే వారిని ఎవరూ దారి మళ్లించలేరన్నారు. దాతృత్వం, శాంతి, కరుణ, ఐకమత్యం, ధార్మిక చింతన, సమానత్వం ప్రపంచమంతా వెల్లి విరియాలన్నదే అల్లాహ్ ఆశయమని అన్నారు. ఏ మతమైనా తోటివారి పట్ల ప్రేమ, దయ, స్నేహంతో మెలగాలని సూచిస్తుందే తప్ప అహింసను ప్రోత్సహించదని గుర్తు చేశారు. మహ్మద్ ప్రవక్త సర్వమానవాళికి ప్రేమ హస్తాన్ని అందించారని, ఆయన చూపిన దైవిక మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. ప్రపంచాన్ని సత్య సందేశంతో సుసంపన్నం చేసిన మొహమ్మద్ ప్రపంచానికి కొత్త ఊపిరులూదిన మహా మనిషి అని తెలిపారు. అనంతరం పెద్ద మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ముతావలి మహ్మద్ ఖాజా, నాయకులు షేక్ కరిముల్లా, రజ్వీ, షేక్ మున్నా, చిరుమామిళ్ల చైతన్యకుమార్, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



నందిగామ పెద్ద మసీదులో ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

కంచికచర్ల: మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా కంచికచర్ల పట్టణంలో గురువారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. మానవాళికి మహ్మద్ ప్రవక్త ఇచ్చినటువంటి బోధనలు పఠిస్తూ పురవీధుల్లో ర్యాలీ జరిగింది. మసీదు మతగురువు గులాం గౌస్ మాట్లాడుతూ ప్రవక్త ప్రపంచ శాంతి కోసం బోధించిన మార్గదర్శకాలను తెలియజేశారు. కార్యక్రమంలో మసీదు సంఘం అధ్యక్షుడు సత్తార్, కార్యదర్శి నూరుద్దీన్, కన్వీనర్, బాజీఖాన్, కోశాధికారి షేక్ రజీమ్ తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో మిలాద్–ఉన్–నబీ వేడుకల్లో మత పెద్దలు

జుజ్జూరులో ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు

జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని ఆయా గ్రామాలలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని గౌసియా జామియా మసీదులో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటూ ప్రవక్త చూపిన మార్గంలో నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ చిన్న మీరాహుసేన్, మత పెద్దలు షేక్ ఖాజాపూర్, షేక్ నాగుల్‌మీరా, అనీఫు, ఖాజా, మౌలాలి, తాజుద్దీన్ బాబా, జయాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వేపలవాగు ప్రాంతంలో తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతూ గృహాలకు, వీధి కుళాయిలకు నీరు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సంబంధిత పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పైపులైన్ మరమ్మతు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడి ప్రజలకు ఇబ్బందిగా ఉండటంతో వెంటనే యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణమే స్పందించి పనులను చేపట్టిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.



పనులను పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ ప్రభాకర్

బీసీల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పెనుగంచిప్రోలు: బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మరోసారి నిరూపించుకున్నారని పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో బీసీ కులగణన చేయాలని తీర్మానం చేయటాన్ని బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి బీసీ కులగణన అవసరమని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బీసీ సామాజిక వర్గాల ఆశలకు ఊపిరి పోసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయటంతో బీసీలందరూ ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

నందిగామ: నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ అన్నారు. భగత్ సింగ్ 116 వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్ బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచిన వీరుడన్నారు. నేటి యువతకు భగత్ సింగ్ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులతో విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామ: పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి మెయిన్ బజార్ ప్రాంతంలో గురువారం గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు.ఆ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన వైరింగ్ మార్పే కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల సమయంలో ప్రారంభించారు. సాయంత్రం 6:25 గంటల వరకు ఈ పనులు కొనసాగాయి. ప్రజలకు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వ్యాపారులతో పాటు, ప్రజలు ఇబ్బందులు పడవలసి వచ్చింది. దీనిపై ఆ శాఖ ఏఈ దిబ్బయ్యను వివరణ కోరగా ఈరోజు ప్రభుత్వ సెలవు దినం కావడంతో మరమ్మతు పనులు మొదలు పెట్టామని, అనివార్య కారణాల వలన పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు.

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రెండో దశలో రీ సర్వే ప్రక్రియలో భూహక్కు పత్రాలను పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామని, జగనన్నకు చెబుదాం– 1902లో నమోదవుతున్న అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు. రెండవ దశలో 15 గ్రామాల్లో రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా 12,968 సరిహద్దు రాళ్ల పాతడం లక్ష్యమని ఇప్పటికే 7 గ్రామాల్లో 8,638 సరిహద్దు రాళ్లను నాటే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మూడో దశ రీ సర్వేలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ వ్యాలిడేషన్ ప్రక్రియను పూర్తి చేసి నిర్దేశించిన ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాంలో పరిష్కరించిన అర్జీల వివరాలు తెలియజేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేది నుంచి అక్టోబర్ 2వ తేది వరకు చెత్త రహిత భారత్‌లో భాగంగా వ్యర్థాల నిర్వహణను చేపట్టామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీరాజ్ ఈఈ కె. వెంకటేశ్వరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నాగమణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 53లో కటారి రాజేశ్వరి, గోపి నివసిస్తున్నారు. వీరిది ప్రేమ వివాహం. గోపి సీలింగ్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా గోపి మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్నాడు. 27వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన గోపి భార్యను కొట్టసాగాడు. దీంతో రాజేశ్వరి తల్లి అడ్డు రాగా ఆమెను కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.